ప్రజాశక్తి
సోమవారం 7 నవంబరు 2022
5
శ్రీకాకుళం



అరసవల్లికి పెరిగిన రద్దీ



పొటెత్తిన సందర్శకులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

కార్తీక మాసం బహుళ శుద్ధత్రయోదశి ఆదివారం కావడంతో అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయానికి సందర్శకుల తాకిడి భారీగా పెరిగింది. దర్శనం కోసం యాత్రికులు రెండు గంటల పాటు క్యూలైనులో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పది రోజుల క్రితం స్వామి దర్శన మార్గాన్ని ఆలయ అధికారులు మార్చిన విషయం తెలిసిందే. ఇంద్రపుష్కరణి ముందున్న అమ్మవారి ఆలయం వద్ద నుంచి యాత్రికులు క్యూ కట్టారు. దీంతో గార, కళింగపట్నం, శ్రీకూర్మం వెళ్లే వాహనాల రాకపోకలకు కాస్త అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను దారి మళ్లించినప్పటికీ రోడ్లపైనే వాహనాలు బారులు తీరాయి. క్యూలైను ఎక్కడి నుంచి మొదలైందో యాత్రికులకు అర్థం కాక పోవడంతో అవస్థపడ్డారు.

సందర్శకుల తాకిడి

ఆదిత్యున్ని వివిఐపిలు, ఇతర ప్రముఖులు సందర్శించారు. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, విధాన మండలి ప్రతిపక్ష నాయకులు యనమల రామకృష్ణుడు, పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి తదితరులు స్వామిని దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ చైర్‌పర్సన్ మల్లెల ఝూన్సీ సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల అనంతరం వారికి శేష వస్త్రాలను కప్పి జ్ఞాపికను అందజేశారు.

పెరిగిన ఆదాయం

అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయానికి సందర్శకుల తాకిడి పెరగడంతో ఆదాయం పెరిగింది. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.9,53,600, విరాళాల రూపంలో రూ.66,550లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,50,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

ఎప్పుడు.. ఏమిస్తారో?

- ఎండియు వాహనాలు బియ్యానికే పరిమితం
- కందిపప్పు, పంచదార ఊసే లేదు

నిరుపేదలు, మధ్య తరగతి కుటుంబాలు పౌర సరఫరాలశాఖ ద్వారా అందిస్తున్న ప్రజాపంపిణీ వ్యవస్థపైనే ఆశలు పెట్టుకున్నారు. ఒకప్పుడు ఈ వ్యవస్థ ద్వారా పంపిణీ అయ్యే సరకులన్నీ ఒక్కొక్కటిగా ప్రభుత్వం ఉప సంహరించుకుంటూ రాయితీపై ఇచ్చే సరుకుల్లో కోతలు పెట్టేసింది. చివరకు బియ్యం, కందిపప్పు, పంచదార మాత్రమే సరఫరా అయ్యేవి. చౌకధరల దుకాణాలను కాదని వైసిపి ప్రభుత్వం డీలర్లను కొనసాగిస్తునే ఎండియు వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ వాహనాలు మీ వీధిలోకి.. మీ ఇంటి వద్దకే సరకులు అందిస్తాయని, కేవలం వాహనం వచ్చినప్పుడు మీ వాలంటీర్లు అక్కడుంది. సరకులను ఇంటికే చేరుస్తారని ప్రభుత్వం మొదట్లో చెప్పకొచ్చింది. కానీ అందుకు భిన్నంగా ఇప్పడు ప్రజా పంపిణీ వ్యవస్థను ఒక్క బియ్యానికే పరిమితం చేస్తున్నారన్న ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతోంది.



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పెరిగిన నిత్యావసర సరకుల ధరల ప్రభావం పేద, మధ్య తరగతి కుటుంబాలపై పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతి నెలా అందించే రాయితీ సరుకులు కుటుంబ పోషణ వ్యయానికి అయ్యే ఖర్చులో కొంత భారం తగ్గేది. అయితే పంచదార, కందిపప్పు సరఫరాలో పౌరసరఫరాలశాఖ కోత విధిస్తూ అరకొరగా ఇస్తుండటంతో పేద కుటుంబాలు బహిరంగ మార్కెట్లను ఆశ్రయించక తప్పడం లేదు. దీంతో పేదోడి ఇంటి బడ్జెట్ తలకిందులవుతోంది.

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సుమారు 1800 చౌకధర దుకాణాలుండేవి. వాటి పరిధిలో 8.30లక్షల తెల్లరేషన్ కార్డులు ఉండేవి. వివిధ సాంకేతిక కారణాల వల్ల సుమారు 25వేల కార్డులు ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దయ్యాయి. మిగిలిన వాటిలో మరి కొన్నింటిని సాంకేతిక కారణాలు చూపిస్తూ అభియన్స్‌లో ఉంచారు. ఉన్న 7.90లక్షల కార్డులకు ఇప్పుడు బియ్యం తప్ప ఇతర సరకులు అందడం లేదు. జిల్లాకు ప్రతి నెలా సుమారు 13,200 మెట్రిక్ టన్నుల బియ్యంతో పాటు 412 మెట్రిక్ టన్నుల పంచదార, సుమారు 920 టన్నుల కందిపప్పు సరఫరా అయ్యేది. బహిరంగ మార్కెట్లో పంచదార కిలో రూ.40, కందిపప్పు రూ.115 పలుకుతోంది. అదే రేషన్ షాపుల ద్వారా ఒక్కో కార్డుదారునికి కిలో కందిపప్పు రూ.67, పంచదార అర కిలో రూ.17కు విక్రయించేవారు. గత నాలుగు నెలలుగా వీటి పంపిణీ సక్రమంగా జరగడం లేదు. గత రెండు నెలలుగా ఒక్క బియ్యానికే పరిమితం చేశారు. దీంతో నిరుపేదలైన కుటుంబాలకు నిత్యావసర సరకులు కార్డు ద్వారా ఇక రాయితీపై సరఫరా కావేమో అన్న భావన వ్యక్తమవుతోంది.

డీలర్లు సైతం ఎదురుచూపులు

కొన్నాళ్లుగా బియ్యంతోపాటు మిగిలిన వాటిని తక్కువ మందికే ఇస్తున్నారు. అదేమని డీలర్లను ఆడిగితే సరకులు రాలేదని చెబుతున్నారని కార్డుదారులు పేర్కొంటున్నారు. గోదాముల్లో ప్రస్తుతం కందిపప్పు, పంచదార నిల్వలు నిండుకున్నాయి. మళ్లీ రాష్ట్రస్థాయిలో ఇస్తే తప్ప కార్డుదారులకు అందే అవకాశం కనపడటం లేదు. వీటి కోసం చాలా మంది డీలర్లు, డీడీలు కట్టి ఎదురు చూస్తున్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉన్నారు

డిఎంహెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి



విద్యార్థినితో మాట్లాడుతున్న మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అస్వస్థతకు గురైన ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటి విద్యార్థుల ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉందని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి తెలిపారు. ఈ నెల 4న వాంతులు, కడుపు నొప్పితో 82మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, వారిలో ఒకరిని ఆస్పత్రికి తరలించగా, ఆరోగ్యం కుదుటపడి డిశ్చార్జి అయ్యారని అన్నారు. మందులతో మరో 42 మంది విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడిందని తెలిపారు. 5వ తేదీ నాటికి మొత్తం 64 మంది విద్యార్థులు ఉండగా అందులో కొత్తగా 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు గుర్తించినట్లు చెప్పారు. వారిలో ఇద్దరు విద్యార్థులకు ఆస్తమా ఉండటంతో వారిని, మరో ఏడుగురు కడుపునొప్పితో బాధపడుతుండటంతో ఆస్పత్రికి తరలించామని చెప్పారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రిపుల్ ఐటీలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి విద్యార్థులను అనునిత్యం వైద్యులు, వైద్య సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. 24గంటలు ఒక వైద్యుడు, ఒక ఇఒ, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఇద్దరు ఎఎన్ఎంలు, ఒక ఆశ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం మెరుగ్గానే ఉందని స్పష్టం చేశారు.

ఆదివారం 114 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేశామని, అందరూ ఆరోగ్యంగానే ఉన్నారని అన్నారు. ఈ పరీక్షల్లో ఆరు కేసులు నమోదయ్యాయని, అయితే ప్రస్తుతం వారి ఆరోగ్యం కూడా బాగానే ఉందని చెప్పారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం కుదుటపడిందని, విద్యార్థులు, తల్లితండ్రులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

నీలం జ్యూట్ మిల్లును తెరవాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు



మాట్లాడుతున్న సురేష్‌బాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అక్రమంగా మూసివేసిన నీలం జ్యూట్ మిల్లును తెరవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులతు ఆర్.సురేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్‌కె నగర్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్మికుల గుర్తింపు లేని ఐఎఫ్‌టియు అనుబంధ సంఘంతో యాజమాన్యం కుదుర్చుకున్న ఒప్పందాన్ని కార్మికులపై బలవంతంగా రుద్దితే సహించేది లేదని తెలిపారు. యాజమాన్యం మిల్లును వెంటనే తెరిచి నడపాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తికి సహకరిస్తామని, అదే సమయంలో యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆయన తెలిపారు. నీలమ్ జ్యూట్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, ఎన్.సూరిబాబు మాట్లాడుతూ మే 2021 నుంచి అమలు కావాల్సిన నూతన వేతన ఒప్పందం కోసం యూనియన్ ఇచ్చిన ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్‌పై ఉప కార్మిక శాఖ అధికారి కార్యాలయంలో పలు దఫాలుగా జరిగిన చర్చల్లో 9.5శాతం బోనస్ ఇవ్వటానికి, మూడు సంవత్సరాలు వరుసగా రోజుకి 4, 4.50, 5శాతం పెంపు చేయటానికి, పండుగ అడ్వాన్స్ రూ.7వేలు ఇవ్వటానికి అంగీకారం కుదిరిందని తెలిపారు. శనివారం విశాఖలోని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వారి కార్యాలయంలో జరిగిన చర్చల్లో యాజమాన్యం కాజువల్ లీవులు ఆరుకు నాలుగే ఇస్తానన్న ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. వారితో పాటు కార్మికులు ఉన్నారు.

వైసిపి పాలనలో చీకటి రోజులు

మాజీ మంత్రి యమనల రామకృష్ణుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ఒకే ఒక్క అవకాశమంటూ ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి మూడేళ్ల పాలనలో చీకటి రోజులు మిగిల్చారని, ఏ ఒక్కరికీ న్యాయం జరగక పోగా రూ.లక్షల కోట్లు కొల్లగొట్టేశారని మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఆరోపించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల ముందిచ్చిన వాగ్దానాల్లో కనీసం ఒక్కటి కూడా అమలుచేయలేదని అన్నారు. నవరత్నాలు పేరుతో మోసగించి నవ లక్షల ఎరకాల భూమలను కొల్ల గొట్టేందుకు జగన్ ఐదేళ్ల ప్రణాళికను సిద్ధం చేసుకున్నారన్నారు. రెండు కాగ్ నివేదికల్లో మొదటి ఏడాదికి రూ.45వేల కోట్లకు లెక్కలు ఇవ్వలేదని, గత ఏడాది కాగ్ నివేదికతో కలుపుకుని మూడేళ్లలో రూ.లక్ష కోట్లకు లెక్కలు చూపలేక పోతున్నారన్నారు. కేంద్రం ఇస్తున్న నిధులదీ అదే పరిస్థితి ఉందన్నారు. అందువల్ల నిధుల వినియోగంపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్ నిధులు రూ.30వేల కోట్లు ఏమయ్యాయో తెలియడం లేదన్నారు. ఐటిడిఎలను సైతం నిర్వీర్యం చేశారన్నారు. రాజధానిపై మంత్రి వర్గంలో ఉన్న మంత్రులకే అవగాహన లేదని, ఒకరు విశాఖ ఒక్కటే రాజధాని అంటే మరో మంత్రి లేదు మూడు రాజధానులంటున్నారని, వారికే విభజన చట్టంపై అవగాహన లేదన్నారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ జగన్‌కు ప్రజలకు మెలు చేయాలన్న ఆలోచన ఎంత మాత్రం లేదన్నారు. బిసిలకు తానేదో గొప్ప మేలు చేస్తున్నానని ప్రచారం చేస్తున్న వైసిపి రాష్ట్ర స్థాయిలో బిసి కులాల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి

- ఒలింపిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్
- కెసి మెమోరియల్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణదాస్



అథ్లెటిక్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

క్రీడల్లో యువత రాణించాలని ఒలింపిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. క్రీడలతో శారీరక సౌష్టవంతోపాటు, ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఆదివారం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో కీర్తిశేషులు కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2022 పోటీలను కృష్ణదాస్ ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 800 మంది బాల, బాలికల హాజరై తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడలను ప్రోత్సహించేందుకు దశాబ్దిన్నర నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తున్న కొన్న వెంకటేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వంతో పాటు దాతల ప్రోత్సాహం క్రీడలకు అవసరమన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కళాశాల వేదికగా ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహించేలా ఏర్పాటు చేయాలని, అందుకు తన పూర్తి సహాయ, సహకారాన్ని అందిస్తానని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖకు సూచించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవి.పద్మావతి మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం రూ.లక్ష వెచ్చించి, ఆయన పేరిట క్రీడా పోటీలను నిర్వహిస్తున్న కొన్న వెంకటేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులు ఆదర్శవంతంగా నిలుస్తారని కొనియాడారు. మీట్ నిర్వాహకులు, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తనతండ్రి జ్ఞాపకార్థం ప్రతి ఏటా రాష్ట్ర స్థాయి లేదా, జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తున్నందుకు తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. పోటీల నిర్వహణలో తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న తన మిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్, పిఇటి సంఘ నాయకులను అభినందించారు. అంతకు ముందు కీర్తిశేషులు కొన్న చిన్నారావు చిత్రపటానికి అతిథులు, అధికారులు, నిర్వాహకులు పూలమాలేసి, ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పూర్వపు జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారులు పద్మజ, వెంకటరమణ మూర్తిలను కృష్ణదాస్, నిర్వాహకులు వెంకటేశ్వరరావు తదితరులు ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛమిచ్చి, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుందరరావు, చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, పూడి తిరుపతిరావు, సనపల రాజా, కొన్న మధుసూదనరావు, నౌపడ విజయ్‌కుమార్, వాండ్రంగి శ్రీనివాసరావు, కొంక్యాన వేణుగోపాల్, పూడి బాలాదిత్య, పేర్ల ఉమాశంకర్, తైక్వాండో శ్రీను, వర్మ, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు పతకాలు అందజేత

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ క్రీడాకారులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంతో ఉత్సాహంగా, ఉత్కంఠగా సాగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను అండర్ 12, 14, 16, 18, 20 విభాగాల్లో నిర్వహించారు. 100, 200, 400 మీటర్ల పరుగు పందేలు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో నువ్వా-నేనా అన్నట్లుగా సాగాయి. పోటీలకు హాజరైన బాల, బాలికలకు భోజన సదుపాయం కల్పించారు. క్రీడల్లో విజేతగా నిలిచిన బాల, బాలికలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇక్కడ జరిగిన పోటీల్లో రాణించిన వారు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక చేయబడతారని ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొన్న వెంకటేశ్వరరావు తెలిపారు.

'ఉక్కు' ప్రయివేటీకరణను అడ్డుకోండి

- రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రధాని పర్యటనలో వివరించండి
- సిఎంకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ

ప్రజాశక్తి - విశాఖపట్నం



వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని చూస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకుని రాష్ట్ర ప్రయోజనాలకు, ప్రజలకు అండగా నిలవాలని కోరుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ రాసింది. అందులోని వివరాలను వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మీడియాకు వివరించారు. ఇప్పటికే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఎటువంటి మార్పూ లేదు.. సరికదా ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మి తీరతామని కేంద్ర మంత్రులు పదేపదే ప్రకటిస్తున్నారన్నారు. అలా అమ్మడం సాధ్యం కాని పక్షంలో పరిశ్రమను మూసేస్తామేగానీ నడపబోమని కేంద్ర మంత్రులు పార్లమెంటు సాక్షిగానే ప్రకటన చేసిన విషయాన్ని అజశర్మ గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు వ్యక్తులకు అమ్మినా, మూసివేసినా రాష్ట్ర ప్రయోజనాలకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు తీరని హాని జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అడ్డుకొని కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపహరించుకునేలా చేయడం రాష్ట్ర ప్రయోజనాల రీత్యా అత్యవసరమన్నారు. ప్రధాని మోడీ ఈ నెల 11, 12 తేదీలలో విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో అది రాష్ట్ర ప్రభుత్వ అధికార కార్యక్రమంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని అజశర్మ ఉటంకించారు. విశాఖలో జరిగే ప్రధాని సభలో ఆయనతోపాటు తమరూ ఉన్నందున విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ప్రధానిని అడగాలని సిఎంను కోరారు. అదే సందర్భంలో రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేయడం లేదన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగరాజపట్నం పోర్టు, విశాఖ, విజయవాడ మెట్రో రైలు వంటివి సాధ్యం కాదని కేంద్రం చేతులు దులిపేసుకుందన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులను నిలిపివేసిందన్నారు. ఉత్తరాంధ్రలో నిర్మించవలసిన పెట్రో యూనివర్సిటీ ఇంకా నిర్మాణమే ప్రారంభం కాలేదని, గిరిజన యూనివర్సిటీకి స్థల సేకరణ కూడా జరగలేదని తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఇస్తామని ప్రకటన చేశారుగానీ ఇంకా ఆచరణ రూపం దాల్చలేదన్నారు. శతాబ్దంపైగా చరిత్ర కలిగిన విశాఖపట్నం రైల్వే డివిజన్‌ను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం ఉత్తరాంధ్రకు అన్యాయం చేయడమే అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం రైల్వే డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఏర్పాటు ఉండాలని ప్రధానిని కోరాలన్నారు. రాష్ట్ర విభజన చట్టాన్ని, దాని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేలా చూడాలన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటంలో భాగంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలనే ఉద్దేశంతో విశాఖపట్నంలోని కార్మికులు, వివిధ తరగతుల ప్రజానీకం ఈ నెల 9 నుంచి 12 వరకు వివిధ రూపాలలో నిరసన ప్రదర్శనలు చేయాలని నిర్ణయించారని, ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధం వంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపడితే అది కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వత్తాసు పలకడమే అవుతుందన్నారు.

వసతిగృహాలపై మరింత శ్రద్ధ

- నాణ్యమైన భోజనం అందించాలి
- పిల్లల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు
- మెనూ అమలు తప్పనిసరి
- బిసి సంక్షేమశాఖ అధికారి ఇ.అనురాధ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



ట్రిపుల్ ఐటి విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో వసతిగృహాల్లో మరింత శ్రద్ధతో పాటు, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి ఇ.అనురాధ ఆదేశించారు. జిల్లాలో అత్యధిక బిసి జనాభా ఉండటం వల్ల విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వాలు వసతి గృహాలను ఏర్పాటు చేశాయి. వాటిలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో బిసి సంక్షేమశాఖ పరిధిలో ప్రతి రోజూ సుమారు 70వేల మంది బాల, బాలికలు వసతి సౌకర్యాలను పొందుతున్నారు. వసతి గృహాల్లో పాటిస్తున్న ఆహార నియమాలు, విద్యార్థుల ఆరోగ్యంపై తీసుకుంటున్న శ్రద్ధ, ఉద్యోగుల ఖాళీల భర్తీకి చర్యలు, చలి కాలంలో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ, తదితర విషయాలను ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.



జిల్లాలోని వసతిగృహాల్లో ఆహార నియమాలు ఎలా పాటిస్తున్నారు?

బిసి సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో 81 వసతిగృహాలను నిర్వహిస్తున్నాం. అందులో 18 పోస్టు మెట్రిక్ వసతి గృహాలు, మిగిలినవి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల కోసం నిర్వహించడం జరుగుతోంది. వాటిలో 63 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల కోసం ఏర్పాటు చేయడం జరిగింది. పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో 10 బాలికల కోసం నిర్వహిస్తున్నాం.కట్టుదిట్టమైన భద్రతతో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా వసతిగృహాల నిర్వాహణ ఉంది. భోజనాల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా ప్రాంతాల్లో వసతిగృహాలను ఏర్పాటు చేశాం. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో కొన్ని చోట్ల హాస్టళ్ల మూతపడే పరిస్థితి ఉంది.

వసతిగృహాల్లో ఉద్యోగుల కొరత ఎప్పటికి తీరుతుందని భావిస్తున్నారు?

జిల్లాలో ఉద్యోగుల కొరత ఉంది. ప్రతి హాస్టల్ నిర్వహణకు సంక్షేమాధికారి పర్యవేక్షణలో నలుగురు ఉద్యోగులు తప్పని సరి. కుక్, కమాటీ, వాచ్‌మెన్, స్వీపర్ వంటి ఉద్యోగులు పూర్తి స్థాయిలో ఉంటే నిర్వాహణకు వీలవుతుంది. అయితే జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య ఏటా తగ్గుతోంది. తాత్కాలిక పద్ధతిలో పొరుగు సేవల ద్వారా కొంతమందిని నియమించడం జరిగింది. అయితే విద్యార్థుల సంఖ్యను బట్టి అక్కడ సిబ్బంది నియామకాలు చేపట్టడం జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో సర్దుబాటు చేయాల్సి వస్తోంది. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకొంటున్నాం.

విద్యార్థుల ఆరోగ్యంపై ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తున్నారు?

వసతి గృహాల్లో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. కోవిడ్ తర్వాత ఈ పరిస్థితులు మరింత మారాయి. సీజనల్ వ్యాధుల వల్ల అస్వస్థతకు గురయ్యే ప్రమాదం వసతి గృహాల్లో ఎక్కువగా ఉంటోంది. అందువల్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు వైద్య బృందాలు హాస్టళ్ల తనిఖీ చేపడుతున్నాయి. అక్కడ ఉండే విద్యార్థులు స్కూల్‌కు తప్ప ఇతర ప్రదేశాలకు వెళ్లకుండా పూర్తి కట్టడి చేస్తున్నాం. అందులో భాగంగా సంక్షేమాధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఎవరికైనా జ్వరం , జలుబు, దగ్గు ఉంటే అందరితో కాకుండా వేరే గదిలో ఉంచి వారికి వైద్యం అందించేలా ఆదేశాలు ఇచ్చాం. వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో సకాలంలో వైద్యం అందిస్తున్నాం.

ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయి. ఈ నేపథంలో మెనూ అమలు ఎలా సాధ్యమవుతోంది?

ప్రభుత్వం నిర్దేశించిన మేరకు వసతిగృహాల్లో మెనూ అమలు తప్పని సరి. ధరల పెరుగుదల వల్ల ఎక్కడైనా సంక్షేమాధికారులు మెనూ అమలును నిర్లక్ష్యం చేస్తున్నట్లు తన దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నియమావళిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వారికి పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగానే పర్యవేక్షణ చేస్తున్నాం. తగినంత మంది పర్యవేక్షణకు వార్డెన్లు లేరు. ఒక్కో వార్డెన్‌కు పక్కనున్న హాస్టల్ పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించడం జరిగింది.

స్కూళ్ల సర్దుబాట్ల వల్ల హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

స్కూళ్ల విలీన ప్రక్రియలో భాగంగా హైస్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు అందుబాటులో ఉన్న వసతి గృహాల్లో సీట్లను పెంచుకునేందుకు వీలుంది. ఆ దిశగా అర్హత గల విద్యార్థులందరికీ వసతి సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

చలికాలంలో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీని ఏ మేరకు పూర్తి చేశారు?

ప్రతి ఏటా చలికాలం రాక ముందే వసతిగృహాల్లో విద్యార్థులు నిద్రించే గదులకు మెస్‌లను అమర్చడం జరుగుతుంది. దుప్పట్లు అందజేయడం జరుగుతుంది. ఈ ఏడాది ఇప్పటికే కొన్ని వసతిగృహాలకు దుప్పట్ల పంపిణీ పూర్తి చేశాం. మిగిలిన వాటికి దుప్పట్లు ఇంకా సరఫరా కావాల్సి ఉంది. త్వరితగతిన అందజేయడం జరుగుతుంది. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం.



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

మధుమేహంపై అవగాహన అవసరం

రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మధుమేహ వ్యాధి ఒక జీవన విధానమని, ఈ వ్యాధి మన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యంగా సంక్రమిస్తూ ఉంటుందని, దీనిపై పూర్తి అవగాహన ఉండాలని రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థో వైద్య నిపుణులు డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యాన నగరంలోని రైతు బజార్ ఎదురుగా ఆదివారం ఉచిత మధుమేహ మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధుమేహం వ్యాధిగ్రస్తులు చక్కనైన వ్యాయామం, ఆహార అలవాట్లతో పాటు మందులు వాడాలని, లేకుంటే అన్ని శరీర భాగాలపైనా దీని ప్రభావం పడుతుందని తెలిపారు. ఎండి, మధుమేహ వైద్య నిపుణులు నిపుణులు డాక్టర్ సత్యస్వరూప్ మాట్లాడుతూ మధుమేహ వ్యాధి నియంత్రణ వ్యాయామం, క్రమం తప్పకుండ మందులు వాడడం, ఆహారపు అలవాట్ల నియంత్రణ ద్వారా సాధ్యపడుతుందని అన్నారు. ఈ శిబిరంలో ఆయన 300 మందికి మధుమేహ పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు, సూచనలు ఉచితంగా మందులు సూచించారు. లయన్స్ క్లబ్ ద్వారా ప్రజోపయోయోగ సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్షులు కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ (హారికాప్రసాద్) తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వావిలపల్లి జగన్నాథనాయుడు, రీజనల్ చైర్మన్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, పొన్నాడ రవికుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల ఆత్మీయ సమావేశం

ఇచ్ఛాపురం : ఏజెంట్లు ఐక్యమత్యంగా ఉండాలని ఎల్ఐసి ఏజెంట్లు అసోసియేషన్ అధ్యక్షులు జి.రాజేంద్రనాయుడు అన్నారు. ఇచ్ఛాపురం శాటిలైట్ బ్రాంచ్ ఆవరణలో ఇచ్ఛాపురం, సోంపేట, పలాస ఏజెంట్ల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. ఏజెంట్ల సమస్యలు, భవిష్యత్‌లో వస్తున్న విప్లత్మాక మార్పులు గురుంచి చర్చించారు. ఏజెంట్ల సంక్షేమంపై మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు రుక్మాంగధరరావు, నాగేశ్వరరావు, వాసుదేవరావు, వసంతరావు, రామ్మూర్తి, హేమాబాబు చౌదరి, వాసుదేవరావు, కె.ధర్మరాజు, తిరుపతిరావు, బుజ్జి శ్రీను, చిన్నారావు, వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రనాయుడు

అడుగడుగునా అపరిశుభ్రత

కపాసుకుద్దిలో పేరుకుపోయిన పూడికలు

ప్రజాశక్తి- కవిటి

ఓ వైపు తీవ్రస్థాయిలో జ్వరాలు విజృంభిస్తున్న వేల కపాసుకుద్దిలో అపరిశుభ్రత తాండవిస్తోంది. గ్రామంలో డ్రెయినేజీలు పూడికుపోయి ఎక్కడ మురుగునీరు అక్కడే నిలిచిపోయింది. దీనిపై సర్పంచ్‌కు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదని, గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా ఉందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జ్వరాలు ఎక్కువగా ఉంటున్న వీధుల్లో పారిశుధ్యం పేరుకుపోయింది. గురువారం గ్రామంలో కలియతిరిగిన డిప్యూటీ డిఎంహెచ్ఒ సురేష్ కుమార్ జెన్నా కూడా పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆయన కబురు పెట్టినా స్థానిక శానిటేషన్ సిబ్బంది అందుబాటులోకి రాకపోవడం గ్రామంలో శానిటేషన్ వ్యవస్థ పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని డాక్టర్ సురేష్ కుమార్ రోగులకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామాజిక పరిశుభ్రత పాటించాలని సూచించారు. మరోవైపు గ్రామంలో పూర్తిస్థాయిలో పారిశుధ్యం పనులు చేపడుతున్నామని సర్పంచ్ కాయ దమయంతి భీమ సేన్ అంటున్నారు. ఇప్పటికే 40 బస్తాల బ్లీచింగ్ గ్రామంలో వేశామని చెబుతున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. చాలా వీధుల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా వేయలేదని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ఇటువంటి పరిస్థితులు నెలకొన్న గ్రామంలో ఎన్ని రోజులు వైద్య శిబిరాలు నిర్వహించినా ఫలితం లేదని, గ్రామంలో అడుగడుగునా అపరిశుభ్రత తాండవిస్తోందని వైద్య సిబ్బంది తెలిపారు. డ్రెయినేజీలో మురుగు పేరుకుపోవడంతో లార్వా ఉధృతంగా వ్యాపిస్తోందని, ఈ లార్వాకు శరవేగంగా జ్వరాలను వ్యాపింపజేసే శక్తి ఉందని వైద్య సిబ్బంది తెలిపారు. తక్షణమే గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించాలని, లేదంటే వ్యాధులు మరింత వ్యాప్తిచెందే ప్రమాదం ఉందని వారు హెచ్చంచారు.



డెంగీ కేసు నమోదైన వ్యక్తి ఇంటి పెరడులో పేరుకుపోయిన చెత్త

డెంగీ కేసు నమోదు!

గీతా మహాలక్ష్మికి గతంలో జ్వరంతో బాధపడుతుండేది. వైద్య సిబ్బంది శుక్రవారం గ్రామంలో రక్త నమూనాలు సేకరించారు. ఇందులో భాగంగా గీతామహాలక్ష్మి రక్త నమూనాలను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షించగా డెంగీ పాజిటివ్ వచ్చిందని ఎంపిహెచ్ఇఒ అభిమాన్యు సోయి తెలిపారు. అయితే అప్పటికే ఆమెకు జ్వరం తగ్గుముఖం పట్టిందని, ఆదివారం కూడా వైద్య పరీక్షలు నిర్వహించగా... ఆమె పూర్తి కోలుకున్నారని తెలిపారు.

ఎప్పటి నుంచో ఈ సమస్య ఉంది



మా గ్రామంలో పారిశుధ్యం సమస్య ఎప్పటి నుంచో ఉంది. గతంలో దీనిపై ఎవరూ దృష్టి సారించలేదు. నేను సర్పంచ్ అయ్యి ఏడాదిన్నర అయ్యింది. అప్పటి నుంచే పారిశుధ్యం పనులు చేస్తున్నాం. ఇక డ్రెయినేజీ పూడుకుపోవడం అంటే గ్రామంలో చాలామంది తమతమ ఇళ్లవద్ద డ్రెయినేజీలో గట్లు వేసుకుంటున్నారు. దీంతో మురుగు పేరుకుపోతోంది. దీనిపై కూడా ఇప్పటికే మాట్లాడాం. నాలాలు వెడల్పు చేసి దగ్గర దగ్గర్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. తొందర్లోనే ఈ సమస్యను పరిష్కరిస్తాం.

– కాయ దమయంతి, సర్పంచ్

అయినా అప్రమత్తంగా ఉంటూ తమ పర్యవేక్షణలో ఉండాలని సూచించారు.

పట్టించుకోవడం లేదు



డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందిజ పారిశుధ్య పనులు చేపట్టాలని చాలాసార్లు సర్పంచ్‌కు చెప్పాం. అయినా పట్టించుకోలేదు. ఇటీవల కాలంలో మా ఇంట్లో ఏడుగురు జ్వరంతో బాధపడ్డారు. పారిశుధ్య పనులు చేయకపోవడంతో ఇంటి పెరట్లోనే మురుగు పేరుకుపోయింది. నాకు డెంగ్యూ వచ్చిందని చెప్పారు. అయితే ప్రస్తుతానికి నాకు జ్వరం లేదు. ఇప్పటికైనా గ్రామంలో పూర్తిస్థాయిలో డ్రెయినేజీలు బాగుచేసి, పారిశుధ్యం పనులు నిర్వహిస్తే వ్యాధులు నిరోధించేందుకు అవకాశం ఉంటుంది.

– గీతామహాలక్ష్మి, కపాసుకుద్ది

సొంతంగా చేసుకుంటున్నా...



మా ఇంటి పరిసరాల్లో నేనే సొంతంగా డ్రెయినేజీ శుభ్రం చేసుకుంటున్నాను. వీధుల్లో పారిశుధ్యం పనులు చేయాలని పంచాయతీ సిబ్బందికి, సర్పంచ్‌కు చాలాసార్లు చెప్పారు. అయినా ఫలితం లేదు. వ్యాధులు రాకుండా మా పరిసరాలు నేనే శుభ్రం చేసుకుని పినాయిల్, బ్లీచింగ్ వేస్తుంటాను.

– బైపిల్లి లక్ష్మి, కపాసుకుద్ది

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లు అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తొగరాంలో రూ. 67 లక్షలతో నాడు-నేడు ఫేజ్-2 కింద జూనియర్ కళాశాల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. అదే పంచాయతీ పరిధిలోని నారిపేట, దిబ్బలపేట గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం కింద రూ.17.20 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యా సంస్థలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రయివేటు విద్యా సంస్థలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యారంగంలో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్య వరకు ప్రక్షాళన చేపడుతున్నామన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడిందని, తద్వారా విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించేందుకు దోహదపడుతుందని తెలిపారు. మనిషి మనుగడకు నీరు అవసరం ఎంతో ఉందని, దానిని గుర్తించిన సిఎం జలజీవన్ మిషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారని అన్నారు.



శంకుస్థాపన చేస్తున్న శాసనసభ స్పీకర్ సీతారాం

పనులను ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం జెఇ చంద్రమౌళిని ప్రశ్నించారు. నెల రోజుల్లో పనులను పూర్తి చేసి నీటి సరఫరాను చేపడుతామని జెఇ బదులు ఇచ్చారు. అనంతరం జగన్ పాదయాత్రకు ఐదేళ్లుపూర్తయిన సందర్భంగా తొగరాం కాలేజీ ఆవరణలో కేకును కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి తమ్మినేని శారద, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, మండల అధ్యక్షులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సోమరాజు జగన్నాథం, ఎంపిడిఒ ఎం.రేణుక, ఎపిఎం పైడి కూర్మారావు పాల్గొన్నారు.



రవిని పరామర్శిస్తున్న మంత్రి అప్పలరాజు

సర్పంచ్ ప్రతినిధిపై దాడి

పలాస : మండలంలోని అల్లుకోలలో వైసిపికి చెందిన రోణంకి రమేష్ ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో వృథా నీరంతా తన పొలంలోకి వచ్చి చేరుతుందని, దీంతో పొలంలోని పంటపోతుందని టిడిపి నాయకు డు పైల గిరిధర్ ప్రశ్నించారు. దీంతో ఇరువురు మధ్య కొంత కాలంగా తగాదాలు జరుగుతున్నాయి. ఆగస్టులో దీనిపై కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ కేసు నమోదు అయిందని స్థానికులు చెబుతున్నారు. అదే కేసు విషయమై ఇరువురు మధ్య రాజీ చేసేందుకు టిడిపి నాయకులు పైల లవకుమార్, పైల నారాయణరావు, పైల ఢిల్లీశ్వరరావులు పైల గిరిధర్ ఇంటికి రమ్మని దువ్వాడ రవికి పిలిచాడు. దీంతో అక్కడకు తన అనుచరులతో వెళ్లిన రవితో టిడిపి నాయకులు వాగ్వాదానికి దిగారు. అనంతరం ఇరువురి మధ్య కొట్లాట చోటు చేసుకుంది. దీంతో రవికుమార్‌కు గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రి సీదిరి అప్పలరాజు ఆస్పత్రికి వెళ్లి రవిని పరామర్శించారు. కాశీబుగ్గ ఎస్ఐ సందీప్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మంత్రితో పాటు పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, హనుమంతు వెంకటరావు, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ మాధవరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కొర్ల సంతోష్‌కుమార్, ఉద్దాన ప్రాంత పంచాయతీల సంఘం అధ్యక్షులు సైని దేశయ్య ఉన్నారు.

గూడెంలో వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్ : మండలంలోని గూడెంకు చెందిన గురుజు శ్రీనివాసరావు (47) దినసరి కూలీ ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు శ్రీనివాసరావు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. చికిత్స పొందుతున్నా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై గ్రామ సమీపంలోని మామిడి తోటలలో పురుగుల మందును తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడికి భార్య పంకజాక్షి, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ-2 గోపాలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దక్షిణాఫ్రికాలో సిక్కోలు వాసి మృతి



లక్ష్మణరావు (ఫైల్)

ఆమదాలవలస : మండలంలోని కలివరం పంచాయతీ పీరు సాహెబ్‌పేటకు చెందిన కూన లక్ష్మణరావు (36) అనారోగ్యంతో దక్షిణాఫ్రికాలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన గతంలో ఇక్కడే డ్రైవర్‌గా పని చేస్తూ ఉండేవాడు. నెల రోజుల క్రితం ప్రొక్లెయినర్ డ్రైవర్‌గా పనిచేసేందుకు దక్షిణాఫ్రికా దేశం వెళ్లాడు. అక్కడ జ్వరం బారిన పడడంతో తోటి డ్రైవర్లు వైద్య చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈయనకు భార్య ప్రమీల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె పది, రెండో కుమార్తె నాలుగో తరగతి చదువుతున్నారు. లక్ష్మణరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. స్వదేశానికి మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడే ఖననం చేసేందుకు అంగీకరించినట్లు సమాచారం.

తాగునీటికి ప్రాధాన్యం



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ దమయంతి

కవిటి : ఉద్దానం ప్రాంతంలో పరిశుభ్రమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జల జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కపాసుకుద్ది సర్పంచ్ కాయ దమయంతి భీమసేన్ అన్నారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా కపాసుకుద్దిలో ఆదివారం మినరల్ వాటర్ కుళాయిలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనిచేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార ఎఫ్‌పిఒ అధ్యక్షుడు కాయ భీమసేన్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు పులకల శ్రీరాములు, ఎంపిటిసి పార్వతి సత్యం, ఉప సర్పంచ్ పాతిన చంద్రశేఖర్, తోట ధర్మారావు పాల్గొన్నారు.

నవభారత నిర్మాత నెహ్రూ

లయన్స్ క్లబ్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు హారికా ప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నవభారతావని నిర్మాణానికి పునాదులు వేసిన మహనీయుడు జవహర్ లాల్ నెహ్రూ అని లయన్స్ క్లబ్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు హారికాప్రసాద్ అన్నారు. నగరంలోని హడ్కో కాలనీ పార్కులో ఉన్న గ్రంథాలయంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన దేశభక్తి గీతాల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి పోటీలు నిర్వహించడం ద్వారా చిన్నారుల్లోని నిగూఢమైన ప్రతిభను వెలికి తీయవచ్చని తెలిపారు. ఆధునిక యుగంలో చిన్నారులు ఎక్కువగా సెల్ ఫోన్లకే పరిమితమైపోతున్నారని, ఇది ఎంత మాత్రం మంచిది కాదని సూచించారు. చదువుతోపాటు సంగీతం, డాన్స్, కవితలు వంటి వాటిపైనా చిన్నారులు ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలన్నారు. ప్రొఫెసర్ నిక్కు అప్పన్న మాట్లాడుతూ పుస్తకాలు ఉంటే సంపద ఉన్నట్లేనని, పుస్తక పఠనం ద్వారా జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విష్ణుమూర్తి, గ్రంథాలయ అధికారి ఉగ్రసేన్, బాలకథా నిలయం వ్యవస్థాపకులు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు రవి, రవితేజ పాల్గొన్నారు. చిన్నారి మేఘన ఆలపించిన దేశభక్తి గీతాలు పలువురుని ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న హారికా ప్రసాద్

భూ సమస్యల పరిష్కారానికి పోరాటం

మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్నాథరావు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడు రైతుల భూ సమస్యల పరిష్కారం అయ్యే వరకూ పోరాటం చేస్తామని, మహిళలపై దాడికి పాల్పడిన అధికారులను సస్పెండ్ చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.జగన్నాథరావు డిమాండ్ చేశారు. వజ్రపుకొత్తూరు మండలం గురుడభద్ర ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బొడ్డపాడు మహిళలపై జరిగిన దాడితో పాటు రైతుల భూములకు నష్టపరిహారంపై ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులతో బాధిత రైతుల పిలుపు మేరకు ఆదివారం సమావేశం నిర్వహించారు. మహిళలపై జరిగిన దాడిని ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు తీవ్రంగా ఖండించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రైతుల భూములకు నష్టపరిహారం చెల్లించకుండా జగనన్న కాలనీకి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. రైతులు, మహిళలపై అధికారులపై, సర్పంచ్, వారి అనుచరులు దాడులు చేయడం హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ మహిళలపై దాడి చేసిన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని, సర్పంచ్‌కు ఉన్న అధికారాలను తొలగించాలని డిమాండ్ చేశారు. రైతుల భూములపై హైకోర్టు స్టే ఇస్తే అటువంటి భూములపై అధికారులు ఎలా వెళ్తారంటూ ప్రశ్నించారు. నష్టపరిహారం చెల్లించకుండా భూములు స్వాధీనం చేసుకోవడం అన్యాయమన్నారు. మహిళలపై దాడులకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఇటీవల జగనన్న టౌన్షిప్ ఏర్పాటు కోసం ప్రభుత్వం 150 ఎకరాలను స్వాధీనం చేసుకొని రైతులకు నష్టపరిహారం చెల్లించిందని, జగనన్న కాలనీకు సంబంధించిన భూములకు ఎందుకు నష్ట చెల్లించడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, మాజీ సర్పంచ్ తామడ త్రిలోచనరావు, బొడ్డపాడు జైభీం యువజన సంఘం అధ్యక్షులు కిక్కిర ఢిల్లీరావు, బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షులు తామడ క్రాంతి, ప్రగతి శీల కార్మిక సమాఖ్య జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన, కారి పురుషోత్తం, కోల పాపారావు, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు దాసరి శ్రీరాములు, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి.కుసుమ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు వాసుదేవరావు, బొడ్డపాడు రైతు సంఘం నాయకులు టి.రామారావు, చైతన్య మహిళ సంఘం నాయకురాలు వంకల సరస్వతి, సారా జోగారావు, వంకల అప్పయ్య, తామడ అప్పారావు, మామిడి కమల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగన్నాథరావు

పోలింగ్ కేంద్రాలు పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ పద్మావతి

ఆమదాలవలస : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ వై.వి.పద్మావతి ఆదివారం పరిశీలించారు. ఓటర్ నమోదుకు ప్రత్యేక శిబిరం నిర్వహించిన నేపథ్యంలో 59, 60, 57 నంబర్లు అయిన అక్కివరం, తోటాడ, వంజంగి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. ఓటరు నమోదు కార్యక్రమంలో ఎటువంటి తప్పులు దొరలడానికి వీలులేదని సిబ్బందికి సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. అలాగే పట్టభద్రులకు అవగాహన కల్పించి గడువులోగా ఓటరుగా నమోదయ్యేటట్లు కృషి చేయాలన్నారు. ఆధార్ సీడింగ్ వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విఆర్ఒ రామారావు, కార్యదర్శి వి.ఎస్.శ్రీకాంత్, బిఎల్ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మల్లేశ్వరరావు


పలాస: పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం 11వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని చేయాలని సిపిఐ (ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యులు మద్దిల మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. కాశీబుగ్గ కోసంగిపురంలో ఆదివారం ఎంఎల్ లిబరేషన్ విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో పరిపాలన చేస్తున్న ఫాసిస్టు బిజెపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్మిక రంగాన్ని, వ్యవసాయ రంగాలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి కమ్యునిస్టు పార్టీలు ఒక్కటై కేంద్రంలో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పాలన చేస్తున్న వైసిపి అభివృద్ధి సంక్షేమ పాలన అందిస్తుందని, ఇది స్థిరత్వమైన పరిపాలన కాదని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి టి.సన్యాసిరావు, మద్దిల రామారావు, నాగేశ్వరరావు, శ్రీను, గోవింద్, దుష్యంత్, తులసమ్మ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నాగేశ్వరరావు

ఓటరు నమోదుపై అవగాహన

కోటబొమ్మాళి: పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని స్థానిక మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం స్థానిక సర్పంచ్ కాళ్ల సంజీవరావు, కార్యదర్శి ఆర్.యోగేశ్వరావుతో కలిసి గ్రామంలో డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారి ఇంటికి వెళ్లి పట్టభద్రు ల ఓటర్‌గా నమోదు చేసుకోవాలని వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. దీని కోసం మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి,కృష్ణారావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

న్యాయ సేవలపై ఇంటింటా ప్రచారం

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ, పాలవానిపేట, యామాలపేటలో కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి సి.హరిప్రియ ఆదేశాలు మేరకు ఆదివారం ఇంటింటికీ న్యాయ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల న్యాయ సేవా సంఘం, నౌపడ పోలీసులు సంయుక్తంగా న్యాయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు భవన నిర్మాణ, అసంఘటిత కార్మికులకు ఉన్న వివిధ ప్రభుత్వ పథకాలు, బీమా అవకాశాలు, ఉచిత న్యాయ సహాయంపై పోస్టర్లను అందించారు. లోక్ అదాలత్‌ల ద్వారా కేసుల పరిష్కారం, ప్రాధాన్యం వివరించారు. నౌపడ ఎఎస్ఐ మెట్ట చంద్రరావు, హెడ్ కానిస్టేబుల్ కె.ప్రసాద్, రైటర్ సింహాచలం, కోర్టు కానిస్టేబుల్ అశోక్ పాల్గొన్నారు.

పెన్షనర్లు పొదుపు సర్టిఫికెట్లను సమర్పించాలి

ఆమదాలవలస : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు పొదుపు సర్టిఫికెట్లను సకాలంలో ఉప ఖజానా కార్యాలయానికి సమర్పించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావు, గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ పొదుపు వివరాలు, ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు పొందే సర్టిఫికెట్లను స్థానిక ఖజానా కార్యాలయానికి ఈనెల 15లోగా జిరాక్స్ కాపీలను సమర్పించాలని ఖజానా అధికారులు తెలిపారని పేర్కొన్నారు. త్వరితగతిన పొదుపు సర్టిఫికెట్లను సమర్పించాలని ఆ ప్రకటనలో కోరారు.

నయనం ప్రధానం



నేత్రాలను పరీక్షిస్తున్న రత్నప్రియ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

నేత్రాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పూడి-గోవిందపురం సర్పంచ్ పాలిన రమ్య చిరంజీవి అన్నారు. పూండి ఆర్ఎస్ గోవిందపురంలో సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యాన సత్యసాయిబాబా జయంతి సందర్భంగా ఆదివారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ నేత్ర ఆస్పత్రి ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ మేరకు 124 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 38 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఎడ్ల రత్నప్రియ, కొంచాడ ధర్మ సన్యాసిరావు, పైల గంగాధర్ బోయిన కేశవరావు, కోడీ నిహాల్, కొంచాడ శేఖర్, అంధవరపు రామారావు, రంగాచార్య సిహెచ్.శివశంకర్, శంకర్ ఫౌండేషన్ నేత్ర ఆస్పత్రి జిల్లా ఇన్‌ఛార్జి టి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని శ్రీనివాసాచార్యులపేట పంచాయతీ పరిధిలోని మండాదిలో శ్రీకాకుళం నగరానికి చెందిన సన్‌రైజ్ ఆస్పత్రి అధినేత, వైద్యులు బొడ్డేపల్లి సురేష్ ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు దీర్ఘకాలిక జ్వరాలు, రక్తహీనత, కాలుష్య లోపంతో బాధపడుతున్నారని అన్నారు. అలాగే బిపి, సుగర్ వ్యాధులపై ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అరగంట పాటు వ్యాయామం చేయాలని, అలాగే నడవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 200 మందికి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఆమదాలవలస : రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సురేష్

చల్లవానిపేటలో...

జలుమూరు : మండలంలోని చల్లవానిపేటలో అదే గ్రామానికి చెందిన సత్యసాయి భజన మండలి ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ వినోద్, డాక్టర్ మనీషా, డాక్టర్ దేవితలు 240 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో ట్రస్టు చైర్మన్ పి.త్రినాథరావు, కన్వీనర్ ఎ.యోగేశ్వరరావు, సత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : ఏటా జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నగరంలోని బెహరా మనోవికాస్ కేంద్రంలో మానసిక వికలాంగులకు వంద దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిమెంట్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ అధ్యక్షులు కాపవరపు శీజు, డాడీ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రభాస్‌సూర్య పాల్గొన్నారు. శీతా కాలంలో చలి తీవ్రత పెరుగుతుండడంతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఏటా దుప్పట్లను పంపిణీ చేస్తున్నట్లు జిల్ ఫౌండేషన్ సభ్యులు సత్యసాయి తెలిపారు. కార్యక్రమంలో సాయి, శివ ప్రసాద్, శేఖర్, వినోద్, మనోజ్, సుమంత్, బెహరా వికాస కేంద్రం నిర్వహకులు శేఖర్ పాల్గొన్నారు.



దుప్పట్లను పంపిణీ చేస్తున్న సభ్యులు



మాట్లాడుతున్న శిరీష

విస్తృతంగా ఓటర్ల నమోదు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గ సమన్వయకర్త గౌతు శిరీష కార్యకర్తలను దిశానిర్దేశం చేశారు. వజ్రపుకొత్తూరు టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు అధ్యక్షతన నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర కౌన్సిల్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి పట్టభద్రులను విస్తృతంగా ఓటర్లుగా చేర్పించాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపిపి గొరకల వసంతస్వామి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.శశిభూషణ్, జిల్లా కార్యదర్శి పి.సాంబమూర్తి పాల్గొన్నారు.



మెడల్స్‌ను చూపిస్తున్న క్రీడాకారులు

స్విమ్మింగ్ పోటీల్లో రాణించిన క్రీడాకారులు


శ్రీకాకుళం : విజయవాడ విజ్జి మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో ఇటీవల నిర్వహించిన ఎపి ఆరో మాస్టర్ స్విమ్మింగ్ పూల్ పోటీలో సిక్కోలు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఎస్.కాంతారావు మూడు గోల్డ్‌మెడల్స్, సిల్వర్, ఎస్.రాధాకృష్ణ మూడు గోల్డ్, సిల్వర్, బి.యశ్వంత్‌శ్రీసాయి శాస్త్రి గోల్డ్, సిల్వర్, డి.మురళీధర్ మూడు సిల్వర్, ఆదిరెడ్డి వెంకటరమణ సిల్వర్ మెడల్స్ పతకాలను సాధించారు. క్రీడాకారులకు ఎపి స్విమ్మింగ్ ఉపాధ్యక్షులు, స్విమ్మింగ్ జిల్లా అధ్యక్షులు కె.ఎన్.ఎస్.బి.ప్రసాదరావు (హరికాప్రసాద్), ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మాన కృష్ణదాస్, సుందరావు, స్విమింగ్ పూల్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

కిరణ్‌కుమార్‌కు అభినందనలు



కిరణ్‌కుమార్

పలాస: మండలంలోని బొడ్డపాడుకు చెందిన సాహుకారి కిరణ్ కుమార్ 'స్టాఫ్ సెలక్షన్ కమిషన్' నిర్వహించిన 'కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ 2020' పరీక్షలో ఉన్నత కొలువు సాధించారు. ఈ నెల 3న విడుదల చేసిన ఫలితాల్లో జాతీయస్థాయిలో 863 ర్యాంకు సాధించి 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్డైరెక్ట్ టాక్సెస్ (సిబిఐసి), డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యారు. కిరణ్ కుమార్ కుంటికోట నారాయణ మోడల్ స్కూల్‌లో పదో తరగతిలో 571 మార్కులు, నూజివీడు ట్రిబుల్ ఐటిలో చదివాడు. ఇంజినీరింగ్‌లో 86 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. క్యాంపస్ ప్లేస్మెంట్‌లో సాఫ్ట్‌వేర్ కొలువు సాధించి రెండేళ్లు పనిచేశాడు. భారతీయ రైల్వే శాఖకు, పోస్టల్ శాఖకు ఎంపికయ్యారు. అక్కడతో ఆగకుండా పైపదవుల కోసం ప్రయత్నం చేసి ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్‌గా కొలువు సాధించారు. అందులో ఇంకా జాయిన్ అవ్వకుండానే సెంట్రల్ జిఎస్‌టి, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నత పదవికి అర్హత సాధించారు. సాధారణ కుటుంబంలో పుట్టిన కిరణ్ నాలుగు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించి గ్రామానికీ ఆదర్శంగా నిలిచారు. ఈయనకు ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధికి వేదిక (యువివి) అధ్యక్షుడు ఇసాకోటి జోగారావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, గౌరవ అధ్యక్షులు రెయ్యి కృష్ణారావు, బి.ఓంకార్, కోశాధికారి యంపల్లి కామేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.గీతమ్మ, కె.ప్రకాశరావు, తెప్పల వాసుదేవరావు, జినగ సీతారాం, తంగుడు ఖగేశ్వరరావు, పి.కృష్ణారావు, కె.సుధాకర్, బి.ఢిలీశ్వరరావు అభినందనలు తెలిపారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి శివరామిరెడ్డి

పోలీస్‌స్టేషన్ తనిఖీ

మెళియాపుట్టి : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను టెక్కలి ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఎం.శివరామిరెడ్డి ఆదివారం సందర్శించారు. వార్షిక తనిఖీలో భాగంగా వచ్చి రికార్డులను పరిశీలించారు. అలాగే క్రైమ్ వివరాలును సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. సరిహద్దుల్లో అక్రమ రవాణాపై మరింత దృష్టి సారించాలని సూచించారు. సిబ్బంది విధి నిర్వహణపై పలు సూచనలు అందించారు. ఆయనతో పాటు పాతపట్నం సిఐ ఎం.వినోద్‌బాబు, ఎస్ఐ టి.రాజేష్, ఎఎస్ఐ నరసింగరావు ఉన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళలు మార్పు

లావేరు : మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరాలో భాగంగా 3 ఫేజ్ పంపుసెట్లకు సరఫరా అయ్యే విద్యుత్ వేళల్లో మార్పు చేశామని విద్యుత్‌శాఖ ఎఇ పి.వెంకటరమణమూర్తి ఒక ప్రకటనలో ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండేదని పేర్కొన్నారు. సోమవారం నుంచి ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు వ్యవసాయ పంపుసెట్లకు 3 ఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటుందని, మండల రైతాంగం ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

గోవిందపురంలో పారిశుధ్య పనులు

సంతబొమ్మాళి : మండలంలోని గోవిందపురం పంచాయతీలో సర్పంచ్ రెయ్యిరామిరెడ్డి ఆధ్వర్యాన ఆదివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. వీధుల్లో ఉన్న చెత్తాచెదాన్ని ఎత్తి గ్రామానికి దూరంగా వెలుపల వేశారు. బావుల్లోను, వీధుల్లోను బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రెయ్య ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి ఎస్.ఢిల్లేశ్వర పాల్గొన్నారు.

టిడిపి పూర్వ వైభవానికి కృషి

నందిగాం: వచ్చే ఎన్నికల్లో సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా కలిసి పనిచేద్దామని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని నౌగాంలో నియోజకవర్గస్థాయి తెలుగు యువత సమ్మేళన కార్యక్రమాన్ని తెలుగు యువత అధ్యక్షులు తూలుగు మహేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గం ఎప్పుడూ తెలుగుదేశానికే మద్దతు తెలుపుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో యువత అంతా ఐక్యంగా పనిచేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అజయ్‌కుమార్, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, జీర్ భీమారావు, బాగాది శేషు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాసునాయుడు

మహా సంకల్పంతో ముందుకు..

ప్రజాశక్తి - జిల్లా విలేకరుల యంత్రాంగం

నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహాసంకల్ప పాదయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమదాలవలస పట్టణ శివారులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న వై.యస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో 2017 నవంబరు ఆరున ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు 3,648 కిలోమీటర్లు పాదయాత్ర చేసి సంచలనం సృష్టించారన్నారు. అప్పట్లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేశారని తెలిపారు. కార్యక్రమంలో యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, దుంపల శ్యామలరావు, దుంపల చిరంజీవి, అల్లంశెట్టి ఉమమహేశ్వరరావు, బోర చిన్నమనాయుడు, కుసుమంచి శ్యాంప్రసాద్, మామిడి రమేష్‌కుమార్, మామిడి ప్రభాకర్ పాల్గొన్నారు.

అలాగే గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ సువర్ణ ప్రతినిధి సువారి సత్యనారాయణ (ఢిల్లీ) వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో రాపాక ఎంపిటిసి మాజీ సభ్యులు పోతురాజు సూర్యారావు, పైడి విజయరమణ, బగాది నేతాజీ పాల్గొన్నారు.

సిఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ 96 శాతం వరకు నెరవేర్చారని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఇచ్ఛాపురంలోని వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, చైర్మన్ నర్తు రామరావు, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

టెక్కలిలోని వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎంపిపి ఎ.సరోజనమ్మ, సర్పంచ్ సుజాతలు పూలమాలు లేసి నివాళ్లర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

పొందూరు పట్టణంలోని వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ అధ్యక్షతన కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ ఆవరణంలోని వైఎస్ఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

సోంపేట ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి డాక్టర్ నిమ్మ దాసు, వైసిపి నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం కేక్‌ను కట్ అందరికీ పంచిపెట్టారు.

నందిగాం వైసిపి కార్యాలయంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కె.బాలకృష్ణ తదితరులు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

వజ్రపుకొత్తూరు మండలం పూండీలోని వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి, మండల అధ్యక్షులు పుక్కల గురయ్యానాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

మెళియాపుట్టి ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, సుజాత, ఆదినారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

బూర్జ మండలం మదనాపురంలోని వైఎస్ఆర్ విగ్రహానికి అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, సర్పంచ్ గోవిందరావు, ఎంపిటిసి నరసింహరావు పూలమాలవు వేసి నివాళ్లర్పించారు.

జి.సిగడాంలోని వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి మండల అధ్యక్షుడు మీసాల వెంకటరమణ, జి.సిగడాం పిఎసిఎస్ అధ్యక్షులు ప్రకాశరావు తదితరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.



ఆమదాలవలస : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న స్పీకర్ సీతారాం



పలాస : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి అప్పలరాజు



పొందూరు : కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు



ఇచ్ఛాపురం : కేక్ కట్ చేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ



టెక్కలి రూరల్ : కృపారాణికి కేక్ తినిపిస్తున్న శ్రీనివాస్



వజ్రపుకొత్తూరు : విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



జి.సిగడాం : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, కూల గొట్టడం, దోచుకుంటూ దాచుకోవడం, ప్రజలను మభ్యపెట్టి విపక్షాలపై విషపు ప్రచారం చేయడం తద్వారా లబ్ధిపొందాలన్న ఆలోచనతో ముందుకెళు తున్నారని, ఇటువంటి సమయంలో ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పాల్సిన అవసరం ఉందని టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో ఆదివారం పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు చెప్పిన మాటలకు గడచిన మూడున్నరేళ్ల కాలం పాటు వైసిపి ప్రభుత్వం సాగిన తీరుకు పొంతన లేదన్నారు. ఒక్కసారి అవకాశమంటూ ప్రజలకు ప్రాధేయపడ్డ జగన్ అసలు రూపం గడచిన మూడున్నరేళ్లలో ప్రజలకు అర్థమైందన్నారు. అయితే రానున్న కాలమే కీలకమని, ఈ సమయంలో అప్రమత్తంగా ఉండి ప్రజల్లోకి వెళ్లి వాస్తవాలు వారికి చెప్పాలని అన్నారు. లేని పక్షంలో ప్రజలను మరో సారి మభ్యపెట్టి ఎన్నికలకు వెళ్లే ప్రమాదం లేక పోలేదన్నారు. సంక్షేమ పథకాల మాటున జరుగుతున్న మోసాన్ని ప్రజలకు చెప్పాలన్నారు. తండ్రిని అడ్డం పెట్టుకుని రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిన జగన్ తన చేతిలో అధికారం ఉంటే ఏం చేస్తాడో ప్రజలకు ఇప్పటికే అర్థమైందని పేర్కొన్నారు. అయినా తిరిగి వారు పోసపోకుండా ఉండేందుకు వారిని చైతన్య వంతులుగా తీర్చి దిద్దాలన్నారు. ఉద్దేశ పూర్వకంగా విపక్షాలను వేధింపులకు గురి చేస్తున్నారని, మాట్లాడే వారి గొంతు నొక్కాలన్న ప్రయత్నంలో పోలీసు యంత్రాంగాన్ని అనుకూలంగా మార్చుకుని తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శిస్తున్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణ,



యనమలతో ఇచ్ఛాపురం టిడిపి నాయకులు

పలాస టిడిపి ఇన్‌ఛార్జి గౌతు శిరీష, పార్టీ ప్రధాన జిల్లా కార్యదర్శి పిరికట్ల విఠల్, కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్ పాల్గొన్నారు.

రామకృష్ణుడిని కలిసిన నాయకులు

జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ అధ్యక్షులు కూన రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి నందికి జాని, తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ జిల్లా అధ్యక్షులు పూనా సంతోష్ కుమార్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల జయదేవ్ యాదవ్ ఉన్నారు.

జగన్మోహనరావుకు పితృవియోగం



నర్సింగరావు (ఫైల్)

శ్రీకాకుళం అర్బన్ : రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పోలుమహంతి జగన్మోహనరావు తండ్రి, విశ్రాంత డెప్యూటీ కలెక్టర్ పి.నర్సింగరావు (92) ఆదివారం కన్నుమూశారు. జిల్లా రెవెన్యూ శాఖలో ఆయన గతంలో ఎంతో కీలకంగా వ్యవహరించారు. ఆయన కుమారుడు జగన్మోహనరావు కూడా రెవెన్యూశాఖలో పని చేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకున్నారు. అనంతరం రెడ్‌క్రాస్‌లో పూర్తిస్థాయి సేవలు అందిస్తున్నారు. నర్సింగరావు నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న తన నివాసంలో అస్వస్థతకు గురైన తుది శ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు సోమవారం ఉదయం 9 గంటల సమయంలో కుటుంబ సభ్యులు నిర్వహిస్తారు.



కషాయాలు తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వేల్పురాయిలో కషాయం తయారీ

ప్రజాశక్తి- రణస్థలం

కత్తెర పురుగు నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నేచురల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని వేల్పురాయిలో మొక్కజొన్న వేయబోవు రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కత్తెర పురుగు నివారణకు ముందస్తు జాగ్రత్తగా ఎలకల అసిరి నాయుడుతో 150 లీటర్ల అగ్నిఅస్త్రాన్ని రైతులకు అవగాహన పరుస్తూ ఆదివారం తయారు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుకు రసాయన క్రిమిసంహారిక పురుగు మందుల వల్ల అధిక ఖర్చులతో పాటు ఆరోగ్యమూ క్షీణిస్తుందన్నారు. ప్రతి రైతూ మీ ఇంటి దగ్గరే స్వసిద్ధంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ప్రతి పంటకూ కావాల్సిన ప్రకృతి ఎరువులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కషాయాలను ద్రావణాలను తయారు చేసుకోవచ్చని అన్నారు. దానికి కావాల్సిన శిక్షణ, సహాయ సహకారాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అందిస్తారని తెలియజేశారు. అలాగే కమ్మసిగడంలో పచ్చిగుల్ల సాయిరాం జామి తోటలో పండు ఈగ నివారణకు, గ్రోథింగ్ నిమిత్తం చేపలు బెల్లం ద్రావణం 20 లీటర్లు తయారు చేసి పిచికారీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాజేశ్వరి, సువ్వాడ సత్యవతి, గులివెందల జ్యోతి, ఎలకల అసిరినాయుడు పాల్గొన్నారు.

గురునాథ్ యాదవ్ పరామర్శ

కోటబొమ్మాళి: మండలంలో సోమనాథపురానికి చెందిన ఎస్ఐ బొడ్డాపు రమణ ఇటీవల తెలంగాణలో అనుమానస్పదంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, వైసిపి నాయకులు జి.గురునాథ యాదవ్ మృతుడు కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ముందుగా రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీనిచ్చారు. ఈయనతో పాటు ఎంపిటిసి బొడ్డు చెంచులు, నీలంపేట ఉప సర్పంచ్ డి.సింహాయ్య, గేదెల నాన్నారావు, బొమ్మాళి సురేష్, బొల్ల శ్రీను ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ జోగారావు

చెరువు పనులు పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పలాసపురంలోని ఆలయం పక్కన ఉన్న కోనేరు ప్రదేశాన్ని ఆదివారం స్థానిక సర్పంచ్ తడక జోగారావు ఆధ్వర్యాన చదును చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తిక మాసం సందర్భంగా యాత్రికులు ఆలయానికి ఎక్కువగా వస్తున్నారని, వారికి ఇబ్బందులు కలక్కుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రొక్లెయినర్ సహాయంతో కోనేరు పక్కనున్న స్థలం మొత్తాన్ని చదును చేయించారు. కార్యక్రమంలో స్థానిక యువత పాల్గొని సహకారం అందజేశారు.

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

నలుగురితో కలివిడిగా ఉంటూ, ఎప్పుడూ ముఖంపై చిరునవ్వులు చిందిస్తూ ఉండే పొల్లాయి ఆనంద్ మోముపై మళ్లీ ఆనందం వెల్లివిరియాలని విశ్రాంత డిఎస్‌పి ఎస్.వి.వి.ప్రసాదరావు అన్నారు. కవిటికి చెందిన పోల్లాయి ఆనంద్ ఇటీవల అనారోగ్యానికి గురై కొద్దిరోజులు విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఇటీవల ఇంటికి చేరుకున్నాడు. అయితే ఆనంద్ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమేనని తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ సభ్యులు, ప్రసాదరావు ఆధ్వర్యాన ఆదివారం రూ.8 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో



కవిటి : సామగ్రిని అందిస్తున్న ప్రసాదరావు

ఎస్ఐ కె.రాము, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, డి.బాబూరావు, పొల్లాయి ఉమామహేష్, కాశీ సాహు, సిసింద్రి పాల్గొన్నారు.

క్రీడాకారునికి...

సోంపేట: మండలంలోని కొర్లాంకు చెందిన రాంబుడ్డి మహేష్‌కు స్థానిక జాగృతి స్వచ్ఛంద సంస్థ రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి మాట్లాడుతూ అస్సాంలోని గౌహతిలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో మహేష్ పాల్గొనున్నాడని తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో అతడికి సంస్థ తరపున చేయూత అందిస్తున్నామని తెలిపారు. గతంలో జరిగిన ఎన్నో రాష్ట్రస్థాయి పోటీల్లో మహేష్ బంగారు, రజత పథకాలను సాధించినట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయి పోటీల్లో సైతం విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ టి.వాసుదేవరావు, మోహన్‌కుమార్, మీనారావు, రామస్వామి పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి...

పలాస : మందస మండలం సొండిపూడికు చెందిన



సోంపేట : ఆర్థికసాయం అందజేస్తున్న గణపతి

డి.ప్రశాంత్ అనే వ్యక్తి బి-టెక్ చదువుతున్నాడు. ఆయనకు రెండు కిడ్నీలు పూర్తిగా పాడయ్యాయి. వైద్యం నిమిత్తం గ్రీన్ ఆర్మీ సంస్థ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, ఎంపిటిసి ప్రతినిధి దడ్డ కిరణ్, గ్రీన్ సభ్యులు దాసరి శ్రీనివాసరావు, నీలాపు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భద్రమహంకాళి ఆలయానికి...

రణస్థలం : మండలంలోని కోటపాలెంలో ఉన్న భద్రమహంకాళి ఆలయ అభివృద్ధికి ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు పట్టణానికి చెందిన కలిశెట్టి రాంబాబు రూ.లక్ష విరాళంగా సర్పంచ్ గొర్లె జగదీష్‌కి ఆలయ కమిటీ సమక్షంలో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సుంకరి కిషోర్‌కుమార్, చౌదరి రాము, ముఠామేస్త్రి రమణ, మహంతి జోగినాయుడు పాల్గొన్నారు.

పేరుకే సాగరాలు... చెరువుల కన్నా అధ్వానం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల రైతాంగం ఏటా వర్షాధారంపై ఆధారపడి సాగు చేస్తున్నారు. సాగునీరు అందించే సాగరాలు, చెరువులు అభివృద్ధి లేక నీటి సామర్థ్యం కోల్పోతున్నాయి. దీంతో రైతులకు సాగునీరు అందని దుస్థితి ఏర్పడుతోంది. చెరువులకు అనుసంధానంగా ఉండే ఛానళ్లు అభివృద్ధి లేక నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండాపోతోంది. బగడ వద్ద ఉండే బగడ సాగరం అభివృద్ధికి దూరంగా ఉంది. పేరుకే సాగరం అయినా చిన్నపాటి చెరువులా కనిపిస్తోంది. సాగరం విస్తీర్ణం 80 ఎకరాలు ఉండేది. సాగరం పరిధిలో 940 ఎకరాలు సాగునీరు అందేది. ఆయకట్టు పరిధిలో 869 మంది సాగు రైతులు ఉన్నారు. సాగరం పరిధిలో ఐదు కిలోమీటర్ల సాగరం గెడ్డ ఉంది. అలాగే సిస్ ఛానల్‌కు అనుసంధానంగా పెద్దగుమ్మడ, బాణాపురం, సూర్జిని, జాడుపల్లి, శేఖరాపురం, బురద రామచంద్రపురం, పెద్దలక్ష్మీపురం సాగునీటి చెరువులకు ఈ ఛానల్ అనుసంధానంగా ఉంది. బగడ సాగరం నుంచి ఈ ఛానల్ ద్వారా అనుసంధానంగా ఉండే చెరువుల్లోకి నీరు చేరి రైతులకు సాగునీరు అందాల్సి ఉంది. సాగరం గెడ్డ ఇసుక మేట్లుతో నిండి నీటి సామర్థ్యం కోల్పోయింది. అనుసంధానంగా ఉండే ఛానల్ ఇసుక మేటలతో పూడికిపోవడంతో ఛానల్ ద్వారా ప్రవహించే నీరు పొలాలకు వైపు నీరు చేరి మేట్లు వేయడంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది. ఇసుక మేట్లు బారిన ప్రాంతంలో పంటలకు నష్టం వాటిల్లుతుంది. ఇసుక మేట్లను తొలగించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. సాగరం ఛానల్ అభివృద్ధి చేస్తే సాగునీటి వసతి చేకూరుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే ముకుందపురం వద్ద ముకుంద సాగరం, అలాగే భావనాపురం వద్ద గజపతి సాగరం, నేలబొంతు సాగరం, ముక్తాపురం పెద్ద చెరువు అభివృద్ధి లేక దయనీయంగా ఉన్నాయి. సాగరాలు, చెరువులు అభివృద్ధి చేస్తే రైతంగానికి సాగునీటి వసతి చేకూరుతుందని ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు చెబుతున్నారు.



కుచించుకుపోయిన బగడ సాగరం

శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదు



సాగరం ఉన్నా శివారు పంటలకు నీరు అందడం లేదు. రైతులకు సాగునీరు అందించే బగడ సాగరం అభివృద్ధి చేయాలి. సాగరం నిండా నీరు నిల్వ ఉంటే ఏడాదికి మూడు పంటలు పండించుకుంటాం. సాగరం ఆక్రమణలకు గురికావడంతో వర్షాధారంపై ఆధారపడాల్సి వస్తోంది.

- పెద్దింటి చంద్రరావు, రైతు, బాణాపురం

సాగరాన్ని అభివృద్ధి చేయాలి



రైతుల ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసిపి బగడ సాగరం అభివృద్ధి చేయాలి. ఈ సాగరం అభివృద్ధి చేస్తే రైతులు ఏటా మూడు పంటలు పండించుకుంటారు. కూలీలకు పని దొరుకుతుంది. దీంతో వలసలు కూడా నివారించవచ్చు. ప్రభుత్వం స్పందించి సాగునీటి పథకాలపై దృష్టిసారించాలి.

- పోలాకి ప్రసాదరావు, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి